ఆనందమానందమాయెే

హామీల అమలులో సీఎం జగన్ కచ్చితంగా వ్యవహరిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. రూ. 3 వేల వరకు పెన్షన్ పెంపుదల చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఈ నెల నుంచి లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేస్తున్నారు. పాలనలో సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి.. సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

- 27, 33, 35, 41 వార్డుల్లో ఉత్సాహంగా పెన్షన్ల అందజేత
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

జగదాంబ : కోట్లాది మంది ప్రజల గుండె చప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం జీవీఎంసీ 35వ వార్డు మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న సైలాడ పైడి తల్లి కల్యాణ మండపంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పింఛన్ల మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో 34 లక్షలున్న పింఛన్లను జగనన్న 66 లక్షలకు పెంచారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17,994 పింఛన్లు ఉండగా, కొత్తగా మరో 160 మందికి రూ. 5.40 కోట్లు అదనంగా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రణాళికాబద్ధంగా వలంటరీ వ్యవస్థ ఏర్పాటు చేశారని కొనియాడారు. ఐదేళ్ల పాలనలో రూ.లక్ష కోట్లను కేవలం పింఛన్లకే వెచ్చించడం అపూర్వమన్నారు. అందుకే జగన్ మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగన్ పాలన శ్రీరామరాజ్యాన్ని తలపిస్తుందని ప్రశంసించారు. నియోజకవర్గంలో ఆపదలో వున్న ఎందరికో తాను ఆర్థిక సాయం చేస్తున్నానన్నారు. 4640 పక్కా ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, త్వరలోనే లబ్ధిదారుల చేత గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. టీడీపీ, జనసేన నేతల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని తెలిపారు. రాష్ట్రంలో ఆరోగ్య కవరేజీ మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచడం దేశంలోనే అపూర్వ ఘట్టమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అలపన కనకరెడ్డి, తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, క్లస్టర్ ఇన్‌చార్జిలు సనపల రవీంద్ర భరత్, రామానంద్, మూలే రామిరెడ్డి, ఆదివిష్ణు, బోని దేవా, ముజీబ్‌ఖాన్, జీవీఎంసీ అధికారులు, యూసీడీ ఏపీడీ పుణ్యవతి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి


35వ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

33వ వార్డులో..

అల్లిపురం : పెరిగిన ఫించన్ల పంపిణీ చురుగ్గా కొనసాగుతోంది. శనివారం 33వ వార్డులో పింఛన్లు పంపిణీ చేశారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి సమక్షంలో సచివాలయం కన్వీనర్ బొర్రా శ్రీనివాసరెడ్డి, వలంటీర్ హిమజ, గృహసారథులు మంగమ్ పార్వతి పాల్గొని వికలాంగునికి రూ.3 వేలు పింఛన్ అందజేశారు. వెంకటేశ్వరమెట్ట సచివాలయం పరిధిలో వృద్ధురాలికి వార్డు మాజీ మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి చిన్నమ్మలు పెంచిన పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

జీవీఎంసీ 41వ వార్డులో..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని బిషప్ కాయిత మరియదాస్ కమ్యూనిటీ హాల్ సచివాలయంలో శనివారం అవ్వాతాతలకు పెరిగిన పింఛన్ అందజేశారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్న ఆచరణలో సీఎం జగనన్న మాట లక్ష్యంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పని చేయాలని ఆమె తెలిపారు. అవ్వాతాతలకు రూ. 2750 నుంచి రూ. 3000కి పెన్షన్ పెంచి ఇవ్వడంతో ప్రతి ఇంట్లో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని పెద్ద కొడుకులా అంతా కొనియాడుతున్నారని అన్నారు. వార్డులో మొత్తం 921 పెన్షన్లు అందిస్తున్నట్లు జోన్-5 ఏపీడీ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సీవో గణేష్, నాయకులు వేలంగిజీరావు, అన్నపూర్ణ, దేవి, ఈశ్వరి, ఆనంద్, శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, కమల్‌కుమార్, ప్రభాత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


41వ వార్డులో కొత్త పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి

జీవీఎంసీ 27వ వార్డులో..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పెంచిన పింఛన్లు పంపిణీ చేశారు. దొండపర్తిలోని పార్టీ కార్యాలయంలో 142 సచివాలయం పరిధికి సంబంధించిన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఈతలపాక విజయ్, ఈతలపాక రవిశంకర్ పాల్గొన్నారు.


27వ వార్డులో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి

41వ వార్డులో ఆయా సచివాలయాల పరిధిలో పింఛన్ల వివరాలు...

సచివాలయం	ఏరియా	పింఛన్లు
1086317	జ్ఞానాపురం-01	288 మంది
1086318	జ్ఞానాపురం-02	264 మంది
1086319	సెబాస్టియన్ కాలనీ	287 మంది
1086234	సుబ్బలక్ష్మీనగర్	82 మంది


వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎల్లంకి చిన్నమ్మలు


33వ వార్డులో వికలాంగునికి పింఛన్ అందజేస్తున్న బొర్రా విజయలక్ష్మి తదితరులు

పెద్ద కొడుకు జగన్‌బాబు..


ఇంటికి పెద్ద కొడుకులా జగన్ బాబు మా లాంటి వాళ్లను ఆదుకుంటున్నాడు. రూ. 3 వేలు పెన్షన్ ఇచ్చి ఎవరి మీద ఆధారపడే అవసరం లేకుండా చేశాడు. ఆయనకు ధన్యవాదాలు.

– పి.చిలకమ్మ, వెలంపేట

ధైర్యం పెరిగింది...


ఒకప్పుడు కేవలం రూ. 50 పింఛన్ కోసమే కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసేవాళ్లం. అటు వంటిది ఇప్పుడు రూ. 3 వేలు జగన్ కొడుకు ఇంటికే పంపిస్తున్నాడు. ఇక ధైర్యంగా బతికేయొచ్చు అన్న భరోసా కలిగింది.

– పి.కొర్లమ్మ, వెలంపేట

మళ్లీ జగనే సీఎం కావాలి..


ఇచ్చిన మాట ప్రకారం రూ. 3 వేలు పింఛన్ ఇచ్చారు. జగన్ అడిన మాట తప్పలేదు. ఏ ప్రభుత్వం మాకు ఇటువంటి ధీమా ఇవ్వలేదు. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– కె.సురేష్, అల్లిపురం

ఆర్థిక భద్రత దొరికింది..


వృద్ధాప్యం కావటం వల్ల ఎవరూ పట్టించుకునే వారు కాదు. అటువంటిది జగనన్న మాకు పింఛన్లు పెంచటంతో మా జీవితాలకు కూడా భద్రత, భరోసా దొరికింది. జగన్ బాబుకు కృతజ్ఞతలు.

– సీహెచ్ నాయుడు, పూర్ణామార్కెట్

క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం


విన్నర్స్, రన్నర్స్ జట్లతో బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి తదితరులు

అల్లిపురం : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆంధ్ర మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా 33వ వార్డు గౌరీవీధి సచివాలయం పరిధిలో గల ఆర్ఎక్స్ 100 బాయ్స్, స్వీట్ బాయ్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 28 పరుగుల తేడాతో స్వీట్ బాయ్స్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేత లకు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, రన్నర్స్‌గా నిలిచిన ఆర్ఎక్స్ 100 బాయ్స్ టీమ్‌కు టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి బహుమతులు అందజేశారు.

8న 'చక్రవర్తి ఏనుగు' కథల సంపుటి ఆవిష్కరణ


చక్రవర్తి ఏనుగు పిల్లల పుస్తకం

అల్లిపురం : ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 8వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు విశాఖ పౌర గ్రంథాలయంలో 'చక్రవర్తి ఏనుగు' కథల పుస్తకం ఆవిష్కరణ జరుగుతుందని అరసం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ బాలల కథా రచయిత ఎస్.హనుమంతరావు రచించిన కథా సంపుటిని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరిస్తారని తెలిపారు. ప్రముఖ విశ్లేషకుడు గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తకాన్ని సమీక్షిస్తారని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తదితరులు

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్య విద్య ప్రచార, మీడియా విస్తరణ అధికారులు సమకూర్చిన 2024 క్యాలెండర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీశ్వర ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎకో-వైజాగ్‌పై ఇంటర్న్‌షిప్


ఎకో-వైజాగ్‌పై ప్రజలకు ఎలా అవగాహన కల్పించారో వివరిస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : ఎకో–వైజాగ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులకు ఎకో-వైజాగ్‌పై ఇంటర్న్‌షిప్ కల్పించడమైందని జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారులు డి. లక్ష్మి, బి. సన్యాసినాయుడు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మాస్టర్ మైండ్ కళాశాల విద్యార్థులకు ఎకో-వైజాగ్‌కు సంబంధించిన 5 ప్రత్యేక అంశాల(ఎకో క్లీన్, ఎకో గ్రీన్, ఎకో బ్లూ, ఎకో జీరో ప్లాస్టిక్, ఎకో జీరో పొల్యూషన్)పై ఇంటర్న్‌షిప్ అధ్యయనం చేపట్టారు. జీవీఎంసీ, ఎస్ఆర్‌యూ ఆధ్వర్యంలో మాస్టర్‌మైండ్ విద్యార్థులు ఐదు గ్రూపులుగా గ్రూప్‌కి పది మంది చొప్పున ఏర్పడి నగరంలో నెల రోజుల పాటు ఎకో–వైజాగ్‌పై కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ శ్రీనివాస రాజమణి, సిబ్బంది, మాస్టర్ మైండ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతి



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న అతిథులు

మహారాణిపేట : విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సాధ్యమని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. శనివారం ఏఎంసీ ఆవరణలో సృజనవాణి స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన స్కాలర్‌షిప్ ప్రొగ్రామ్–2023లో ఆయన పాల్గొన్నారు. ఆర్థిక వెనుకబాటుతో విద్యార్థులు విద్యకు దూరం కాకూడదనే ఆలోచనతో సృజన వాణి సంస్థ విద్యార్థులకు చేయూతనివ్వడం మంచి పరిణామమన్నారు. చెగ్ ఇండియా కంపెనీ సీఈవో శ్యామ్ మాట్లాడుతూ చదువుపై ఆసక్తి ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లొమా, నర్సింగ్, బీఈడీ చదువుతున్న 192 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చామని తెలిపారు. సృజనవాణి ఉపాధ్యక్షుడు జి.ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది 400 మంది విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ జై సుమ, ప్రభుత్వ కెమికల్ డిప్లొమా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, పెందుర్తి ప్రభుత్వ డిప్లొమా కాలేజీకి చెందిన ఎన్.చంద్రశేఖర్, సృజనవాణి కోఆర్డినేటర్ రామారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులకు ఆదేశాలు


అధికారులకు ఆదేశాలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు మరమ్మతులు, పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జోన్-5, జోన్-8 పరిధిలోని బీఆర్‌టీఎస్ రోడ్డును శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్-5 పరిధి జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డులోని సెంటర్ కారిడార్ పనులు, సర్వీస్ రోడ్డు, ఫుట్‌పాత్ మరమ్మతులు, పాత్‌హోల్ పనులు, సెంటర్ మీడియన్ గ్రిల్స్, ఫుట్‌పాత్ పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టి, పది రోజుల్లోగా పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు వేణుగోపాల్, సర్వీస్ రోడ్డులో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు వెంటనే తొలగించాలని జోనల్ కమిషనర్ కృష్ణను ఆదేశించారు. అనంతరం జోన్–8 పరిధి ఎన్ఏడీ నుంచి పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డును పరిశీలించి సెంటర్ మీడియన్ గ్రిల్స్, డివైడర్లు, ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టి ఆకర్షణీయమైన పెయింటింగ్ వేయాలని, అలాగే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి కూడా పెయింటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు రామ్మోహనరావును ఆదేశించారు. అలాగే జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు తారు రోడ్డు వేసేందుకు అంచనాలు తయారు చేయాలని, జ్ఞానాపురం నుంచి పెందుర్తి వరకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, అనధికారక హోర్డింగ్‌లు, ఫుట్‌పాత్‌లపై అనవసరమైన పోల్స్ వెంటనే తొలగించాని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు.

ఘనంగా గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవం


గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

దాబాగార్డెన్స్ : గీత్ సంగీత్ సాంస్కృతిక సంస్థ ద్వితీయ వార్షికోత్సవం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, కొణతాల రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అలనాటి గీతాల నుంచి సరికొత్త పాటల వరకు తెలుగు, హిందీ గీతాలతో గాయనీ గాయకులు అలరించారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, శైలజ మిరాజ్, నీలిమ, సత్య, మహ్మద్‌ఖాన్ దేవరాజ్, బంగారయ్య, వీవీ చారి, బంగార్రాజు, భాస్కర్, జోసెఫ్, మంజుల, విజయ రమణి, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

అల్లిపురం : గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 కేజీల గంజాయి, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలపై వినతి

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) విశాఖ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జె.సోమశేఖర్, పి.భాస్కరరావు నేతృత్వంలో సభ్యులు శనివారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన సెలవులు, ఇతర సమస్యలపై ఆయనతో సంఘ నాయకులు చర్చించారు. సభ్యులు వాసుదేవరావు, రమేష్‌నాయుడు, సత్యనారాయణ, గోవింద్, మురళీధర్, అజయ్, శ్రీనివాసరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

30వ వార్డులో 'మా నమ్మకం నువ్వే జగన్'


ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న దశమంతుల మాణిక్యాలరావు, కోన శంకర్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 30వ వార్డు ఎగువ రెల్లివీధిలో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాల బ్రోచర్ అందజేశారు. వార్డు నాయకుడు దశమంతుల మాణిక్యాలరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి కోన శంకర్, పిల్లా బాలు, మహిళా నాయకురాలు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు సెమెట్రీ సమస్య పరిష్కారానికి వినతి


కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాన్ వెస్లీ తదితరులు

మహారాణిపేట : వాల్తేరు సెమెట్రీ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున హామీ ఇచ్చినట్లు ఏపీ క్రైస్తవ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో కొంత మంది క్రైస్తవులు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వాల్తేరు సెమెట్రీలో స్థలం లేకపోవడం వల్ల చనిపోయిన వారిని ఖననం చేసే అవకాశం లేక ఇబ్బంది పడుతున్నామని, కొత్తగా స్థలం కేటాయించాలని కోరినట్టు వెస్లీ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిమెట్రీ అధ్యక్షుడు చీడి జార్జి, సెక్రటరీ మ్యాచ్ పీటర్, కోశాధికారి ఫాదర్ థామస్ పుల్లట్, బోర్డు మెంబర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులుతీరారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు అమ్మవారికి క్షీరాభిషేకం, పసుపు కుంకుమ నీళ్లతో అభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, సర్వదర్శనం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన పూజ నిర్వహిస్తారు.


కనకమహాలక్ష్మి రథయాత్రలో తప్పెటగుళ్ల ప్రదర్శన

జేఏసీ అమరావతి అధ్యక్షుడిని కలిసిన ఉద్యోగులు

మహారాణిపేట : ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, సహాధ్యక్షుడు ఫణి పేర్రాజు, రాష్ట్ర డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్‌రావులను శనివారం ఎన్‌జీవో హోంలో రాష్ట్ర నాలుగో తరగతి ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు గురజాడ కళాక్షేత్రంలో జరిగే మున్సిపల్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్. మల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావు, విశాఖ జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి వియ్యపు నాగయ్య, జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు ఒమ్మి పెద్దారావు, జిల్లా సహ అధ్యక్షుడు ఎల్. లోకేష్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రావాడ సత్తిబాబు, పి. శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి పి. వెంకటరమణ, జిల్లా డివిజనల్ అధ్యక్షుడు మన్యాల రామారావు, జిల్లా మాజీ సంయుక్త కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వర్లుతో ఉద్యోగులు

అమ్మకు వందనం..

దాబాగార్డెన్స్ : నగరంలోని నీలమ్మ వేపచెట్టు సమీపాన గల కాశ్యప్ విద్యానికేతన్‌లో శనివారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గత పదేళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ పిల్లలకు అమ్మ పట్ల అభిమానం, ప్రేమ పట్ల అవగాహన కలిగిస్తున్నట్లు కరస్పాండెంట్ కె. శ్రీనివాస్ తెలిపారు. పిల్లల్లో తల్లిదండ్రుల పట్ల నైతిక బాధ్యత తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలు తమ తల్లిదండ్రుల కాళ్లు కడిగి ఆశీస్సులు అందుకున్నారు. సుమారు 100 మంది తల్లులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లీబిడ్డల అనుబంధంతో పాఠశాల ప్రాంగణం ప్రేమ, క్షమ, ఆనందం, ఆశీర్వాదంగా మారింది.


తల్లుల కాళ్లు కడిగి ఆశీర్వాదం పొందుతున్న చిన్నారులు

పంకజ్ కుటుంబానికి ఎమ్మెల్యే వాసుపల్లి అండ


బాధితుడి భార్య సరితతో మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్, ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డుకు చెందిన మరుగుజ్జు పంకజ్ కుమార్‌శర్మ వెన్నుముక సమస్యతో బాధపడుతున్నారు. దీనికి చికిత్స కోసం ఆరిలోవ ఎంబీ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా వారు ఆపరేషన్ కోసం రూ. 5 లక్షలు వసూలు చేసి మోసం చేసినట్టు ప్రజాదర్బార్‌లో పంకజ్ కుమార్‌శర్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బాధితుని ఇంటికి వెళ్లి పరామర్శించారు. మందుల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీలో వర్తించే జబ్బుకు ఆస్పత్రి వారు అధిక మొత్తంలో డబ్బు తీసుకోవడమే కాకుండా ఆపరేషన్ కూడా సక్రమంగా చేయకపోవటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు బాధితుని కుటుంబం వాపోయింది. ఈ నేపథ్యంలో బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు వారు నష్టపోయిన రూ.5 లక్షలు తిరిగి ఇచ్చే విధంగా మాటిచ్చారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ వద్దకు శనివారం బాధితుడి భార్య సరితను తీసుకెళ్లి ఆపరేషన్‌కు సంబంధించి మాట్లాడారు. వైద్యం చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.